

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 | మార్చి, 2023 | సంచిక : 10

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ........ రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం ........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** — **పుట సంఖ్య**

మా వాణి ........ 2
తత్త్వోపదేశం ........ 5
మానవుడు-దైవం ........ 8
శాశ్వత ధర్మగోప్త ........ 13
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 16
సాయిభక్త దాసగణు ........ 18
శ్రద్ధాంజలి ........ 20
DECLARATION ........ 21
భోగత్యాగంతో బ్రహ్మానందం ........ 22
మాతృసంస్థ కబుర్లు ........ 27

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



(పాఠకులకు నమస్కారం, సంపాదకులు సంపాదకీయం వ్రాయటం ద్వారా తమ మనోభావాలను పాఠకులకు అందించటం సాంప్రదాయకంగా వస్తున్నది. అయితే, ఒక్కోసారి మన భావాలు మన మనస్సునెవరో చదివి నంత స్పష్టంగా పలుకుతోంటే ఎంతో ఆశ్చర్యం, ఆనందం, సంభ్రమం కూడా కలుగుతాయి. అంతేకాదు-అనంతకాలంగా యీ అనాద్యంత విశ్వాంత రాళంలో పరిభ్రమిస్తున్న ఎన్నెన్నో దివ్యాత్మల మహాగురువుల సందేశాలు ఎప్పుడో ఒక్కసారి వచ్చి మన హృదయాలను స్పృశిస్తూ ఉంటాయి. అవి ఏదో ప్రయోజనాన్ని ఆశించే మన దగ్గరికి పంపబడతాయి. అలా ఈ రోజు వేకువజామునే నా చేతికి వచ్చిన వివేకానందుల వారి దివ్య సందేశం ఇది. సార్వకాలీనం, సార్వజనీనం అయిన ఇది కనపడిన తర్వాత ఇంక నా కలానికి వేరే పనేముంది? అదే అమృత గంగలో అందరం మును గుదాం అనిపించి అదే మీకు అందిస్తున్నాను

- ప్రధాన సంపాదకులు)

నాయనలారా! దేశభక్తులు కండి. గతంలో ఎన్నో ఘనకార్యాలు నిర్వహించిన మీ జాతిని ప్రేమించండి. ఓ నా సాహస బాలకులారా! మీకు వేరే ఏమీ అక్కరలేదు. ప్రేమ, నిజాయితీ, సహనం తప్ప, జీవితం అంటే ఏమిటి? వ్యాప్తి. అంటే ప్రేమ. అందుచేత ప్రేమే జీవితం. ఇదే జీవనానికి ఏకైక న్యాయం. స్వార్థమే మరణం. ఇక్కడ, ఇటుపైన, ఎప్పుడైనా, ఎక్కడైనా ఇదే సత్యం. జీవితమన్నది మంచి చెయ్యడానికే ఉంది. ఇతరులకు ఏమీ చెయ్యలేకపోతే అది మరణంతో సమానమే. మీరు చూచే వారిలో 90% మానవమృగాలు, మృతప్రాయాలే, దయ్యాలే. ఎవడు ప్రేమించలేడో వాడు

జీవించి ఉన్నట్లు కాదు. స్పందించండి, నాయనలారా! పేదల కోసం, మూర్ఖుల కోసం, అణగారిన అనాథల కోసం బాధపడండి. మీ తల తిరిగి పోయి, గుండె ఆగిపోయి, పిచ్చెక్కుతుందేమో అన్నంత వరకూ ఆలోచించండి. అప్పుడు మీ ఆత్మను ప్రభువు చెరణాల చెంత సమర్పించండి. అప్పుడు దొరుకుతుందయ్యా మీకు - శక్తి, సహాయం, ఎదురులేని-ఎవరూ అణచలేని సామర్థ్యం. పోరాటం, పోరాటం! గత పది సంవత్సరాలుగా నా ఆదర్శం ఇదే. ఇప్పుడు కూడా పోరాడమనే అంటాను. అంతా అంధకారమయంగా ఉన్నప్పుడు శ్రమించమని అన్నాను. అప్పుడు కొద్దిగా వెలుగుచొచ్చుకు వస్తున్న వేళ కూడా ప్రయత్నం చేయండి. ప్రయాసపడండి అంటాను. భయపడకండి నాయనలారా! అనంత తారలతో నిండిన సభామండలం నుండి ఏదో వచ్చి మిమ్మల్ని అణగద్రొక్కుతుందని భయపడకండి. వేచి చూడండి. కొద్ది గంటల్లో ఆ మొత్తం మీ పాదల క్రింద ఉంటుంది. ఆగండి. డబ్బుతో లాభం లేదు. పేరుతోనూ లాభం లేదు. కీర్తి, పాండిత్యం కూడా పనికిరావు. నీకు ఫలితాన్ని ఇవ్వగలిగిందల్లా ప్రేమే. నీ శీలమే కష్టాల మొండిగోడల నుండి దూసుకుపోగల చాతుర్యాన్ని నీకు ఇస్తుంది.

ఏ మనిషినైనా, జాతినైనా గొప్పవి చేయగలవి మూడే.

1) సచ్ఛక్తులన్నింటినీ ఏకీకృతం చేయటం

2) అసూయా సందేహాలకు చోటు లేకుండా చేయడం

3) మంచి చేసే వారికీ, మంచితనంతో ఉన్న వారికీ సహాయపడటం

ప్రారంభం చిన్నగా ఉందని బాధపడక, మహత్తర విషయాలు దాన్ని అనుసరించే వస్తాయి. ధైర్యంగా ఉండు. నీ సోదరగణానికి నాయకుడవయ్యే పని చెయ్యకు. సేవించే ప్రయత్నం చెయ్యి. ఇతరులకు నాయకుడు కావాలనే పాశవిక వెర్రి వలననే ఎన్నో జీవన నౌకలు మునిగిపోయాయి. ఈ విషయంలో జాగ్రత్తపడు. మరణించే క్షణం వరకు నిస్వార్థంగానే ఉండు. పనిచెయ్యి.

మీరందరూ మహత్కార్యాల సాధించడానికై జన్మించిన సాహస





బాలురని విశ్వసించండి. కుక్కల మొరుగుళ్ళకే కాదు. ఆకాశం నుండి విరుచుకుపడే పిడుగులక్కూడా భయపడకండి నిలబడి పనిచెయ్యండి.

ప్రపంచ చరిత్రలో ఎక్కడైనా కేవలం ధనంతో ఉత్తమ కార్యాలు నెరవేరాయని విన్నారా? ఎప్పుడైనా మెదడు, హృదయము మంచి పనులు చేయగలవే తప్ప ధనపు సంచులు కాదు.

డబ్బు దానంతటది అదే వస్తుంది. మనకు మనుష్యులు కావాలి. ఏ పని అయినా మనిషి చెయ్యగలడు గాని డబ్బు ఏం చేస్తుంది? ఎంత మంది వ్యక్తులు దొరికితే అంత మంచిది. ప్రపంచంలోని సమస్త సంపత్తి కన్నా మానవులే విలువైనవారు. సాహసబాలకులారా, డబ్బు ఉండనివ్వండి - లేకపోనివ్వండి. మనుషులు దొరకనివ్వండి-దొరకక పోనివ్వండి- ముందుకే నడవాలి. నీకు ప్రేమ ఉందా? దైవం ఉన్నాడా? చాలు-నిన్ను ఎవ్వరూ ఆపలేరు-లక్ష్యఛేదనం చేసేవరకు.

ఇతరులు ఏమైనా అనుకోనీ నీ పవిత్రతను, నీ నైతికతను, దైవం పట్ల నీ భక్తిని, నీ స్థాయిని నువ్వు తగ్గించుకోవద్దు. పవిత్రత అన్నది భూమి మీదే కాదు. స్వర్గంలో కూడా అత్యంత దివ్యమైన శక్తి. దైవాన్ని ప్రేమించే ఏ వ్యక్తిగానీ, మాయకు భయపడాల్సిన అవసరం లేదు. అర్థమృతులై ఉన్న ధనికులపైన విశ్వాసం ఉంచకు. ఆశలన్నీ మీ వంటి అతి సామాన్యులైన-కాని విశ్వాసపాత్రులైన బిడ్డల మీదనే ఉంచండి. హృదయంలేని మేధావి రచయితల గురించీ, వాళ్ల రక్తం చచ్చిన వ్రాతల గురించీ ఏమీ ఆలోచించకండి. విశ్వాసం, సానుభూతి! జ్వలించే విశ్వాసం! ప్రజ్వలించే సానుభూతి! చావులేదు-జన్మలేదు. ఆకలి లేదు-చలి లేదు. పరమ ప్రభువుకు జయమగు గాక! నడవండి ముందుకు ఆ ప్రభువే మన సేనాపతి! ఎవరు పడిపోయారో చూడ్డానికి కూడా వెనక్కు తిరక్కు. ముందుకే, ముమ్ముందుకే నడువు. ఒకరు పడితే మరొకరు ఆ పనిని అందుకుంటారు.

ఈ నా అగ్ని మిమ్మందరినీ చుట్టుకొనుగాక! మీరందరూ ప్రగాఢమైన దివ్యాత్ములు అవుదురు గాక! రణరంగంలో వీరోచిత మరణం మీకు ప్రాప్తించు గాక. ఇదే వివేకానందుని ప్రార్థన.

# తత్త్వోపదేశం

**– శ్రీ నండూరి వారి 'విశ్వదర్శనం' నుండి**

ఉపనిషత్కాలపు ప్రాచీన భారతదేశంలో యాజ్ఞవల్క్యుడు గొప్ప ఋషిగా, మహామేధావిగా, బ్రహ్మతత్వవేత్తగా గణనకెక్కాడు. అతని తండ్రి వాజసుడు. కనుక అతడు వాజసనేయుడయ్యాడు. వ్యాస శిష్యుడైన వైశంపాయన మహర్షికి అతడు శిష్యుడు. గురువు వద్ద యజుర్వేదం అభ్యసించాడు. ఒకసారి గురువుతో ఏదో తగాదా పడ్డాడు. గురువు కోపగించి అతడు నేర్చుకున్న విద్య అంతా తనకు తిరిగి అప్పగించమన్నాడు. అతడు అదంతా కక్కివేసి ఆ తర్వాత సూర్యుడిని గురించి తపస్సు చేశాడు. సూర్యుడు యాజ్ఞవల్క్యుడికి యజుర్వేదమంతా తిరిగి నేర్పాడు. యాజ్ఞవల్క్యుడు తాను సూర్యుడి నుండి నేర్చిన యజుర్వేదాన్ని లోకంలో ప్రచారం చేశాడు. దానికే యజుర్వేద వాజసనేయశాఖ అని, శుక్ల యజుర్వేదమని పేర్లు వచ్చాయి. అతడు గురువుకు అప్పగించి వేసిన దానికి కృష్ణయజుర్వేదం అని పేరు.

దశోపనిషత్తులలో ఆఖరిది, పరిమాణంలోనే కాక ప్రమాణంలో కూడా గొప్పది అయిన బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు ప్రధానపాత్ర, ఆసక్తి కలిగించే పాత్ర. ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేదంలోనిది.

అతడికి ఇరువురు భార్యలు. ఒక భార్య పేరు కాత్యాని, ఆమె సాధారణ స్త్రీ. గృహకృత్యాల నిర్వహణలో నిమగ్నురాలై ఉండేది. కాగా, రెండవ భార్య మైత్రేయి. ఆమె బ్రహ్మవాదిని, తత్వజిజ్ఞాస కలిగిన మహిళ.

ఒకసారి యాజ్ఞవల్క్యుడు సాంసారిక జీవితాన్ని వదలిపెట్టి సన్యాసాశ్రమం స్వీకరించగోరి మైత్రేయితో "నా సంపద అంతా మీ ఇరువురికి పంపకాలు చేయదలచాను" అన్నాడు. (యాజ్ఞవల్క్యునికి ముందు ఋషులెవ్వరూ సన్యాసాశ్రమం స్వీకరించినట్టు లేదని, దానికి బహుశా





అతడే ప్రారంభకుడు కావచ్చునని కొందరు పండితుల అభిప్రాయం.)

అప్పుడు మైత్రేయి "ఈ సంపదలు, ఆస్తిపాస్తులు నాకెందుకు? వాటి వల్ల నాకు అమృతత్వం కలుగుతుందా?" అన్నది.

"నిజమే, ధనం వల్ల, సంపదల వల్ల అమృతత్వం సిద్ధించదు" అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

"అయితే వాటివల్ల నాకేమి ప్రయోజనం? వారు అమృతత్వం పొందే విధానం ఉపదేశించండి" అన్నది మైత్రేయి. యాజ్ఞవల్క్యుడు ఆమె వైరాగ్య భావానికి ఎంతో సంతోషించి ఉపదేశం చేశాడు.

ఆయన ఈ సందర్భంలో చేసిన ఉపదేశం ఉపనిషద్వాఙ్మయంలో చాలా ప్రసిద్ధమైన భాగం.

"సహోవాచ,

సహ అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి

ఆత్మ నస్తు కామాయ పతిః స్థియో భవతి

నవా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవతి

ఆత్మ నస్తు రామాయ జాయా ప్రియా భవతి

నవా అరే పుత్రాణం కామాయ పుత్రాః ప్రియ భవన్తి

ఆత్మ నస్తు కామాయ పుత్రాః ప్రియా భవన్తి ..."

ఈ ఉపదేశ మంత్రం ప్రారంభమై "ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో, మంతవ్యో నిధి ధ్యాసితవ్యో మైత్రేయి ఆత్మనిఖిల్వరే దృష్టే శ్రుతే మతే విజ్ఞాత ఇదం సర్వం విదితం" అని ముగుస్తుంది.

"ఓ మైత్రేయీ భార్య తన భర్తను భర్త కోసం ప్రేమించడం లేదు. తన కోసమే అంటే తన ఆత్మ కోసమే (తనలో వలెనే తన భర్తలో కూడా వున్న తన ఆత్మ కోసమే) భార్య భర్తను ప్రేమిస్తున్నది. భర్త భార్యను భార్య కోసమే ప్రేమించడం లేదు. భర్త భార్యను తన కోసమే (ఆత్మ కోసమే) ప్రేమిస్తున్నాడు. పుత్రులను తల్లిదండ్రులు ప్రేమించేది పుత్రుల కోసం కాదు. వారు తమ

ఆత్మ కోసమే పుత్రులను ప్రేమిస్తున్నారు. అలాగే ధనాన్ని, బ్రాహ్మణుడిని, క్షత్రియుడిని, లోకాలను, సమస్త భూతాలను మన కోసమే (ఆత్మ కోసం) ప్రేమిస్తున్నాము. ఇంతెందుకు? మనం దేన్ని ప్రేమించినా మన ప్రయోజనం కోసమే వాటిని ప్రేమిస్తున్నాము. అందుచేత ప్రియులారా! ఆత్మ ఒక్కటే దర్శించదగినది, వినదగినది, ఆలోచించదగినది, ధ్యానించదగినది. దాన్ని చూడడం వల్ల, వినడం వల్ల, ఆలోచించడం వల్ల, తెలుసుకోవడం వల్ల యీ సమస్తం విదితం అవుతుంది.

ఎందుకంటే దుందుభిని మ్రోగించినప్పుడు దాని నుంచి వెలువడే వివిధ శబ్దాలను దుందుభి నుంచి నేరుగా గ్రహించలేము. అవన్నీ దుందుభి ధ్వానంలో లీనమయ్యే శబ్దాలే. అలాగే శంఖం పూరించినప్పుడు జనించే శబ్దాలు శంఖధ్వని కంటే భిన్నమైనవి కావు. అవి శంఖధ్వనిలో అంతర్భాగాలైన శబ్దాలే. అలాగే వీణాసాధనం చేసినప్పుడు వినబడే ప్రత్యేక స్వరాలు వీణానాదం కంటే వేరైనవి కావు. అవన్నీ దానిలోని భాగాలే. (సయథా వీణాయై వాద్య మానాయైన బాహ్యాంశబ్దాన్ శక్నుయా ద్గ్రహణాయ, వీణాయైతు గ్రహేణేన-వీణావాదస్య వా శబ్దో గృహీతః)

అన్ని నదులకు సముద్రమే గమ్యస్థానం అని దానిలో విలీనమైన తమ ప్రత్యేక అస్తిత్వాన్ని త్యజిస్తాయి. అలాగే అన్ని స్పర్శలకు గమ్యం త్వగింద్రియం. అన్ని వాసనలకు నాసిక, అన్ని రుచులకు నాల్క, అన్ని శబ్దాలకు చెవులు, అన్ని ఆలోచనలకు మనస్సు, అన్ని విద్యలకు హృదయం, అన్ని కర్మలకు చేతులు, అన్ని సుఖాలకు జననేంద్రియం, అన్ని విసర్జనలకు పాయువు, అన్ని దారులకు కాళ్ళు, అన్ని వేదాలకు వాక్కు ఒకే ఆయతనంగా వుంటాయి.

నీటిలో ఉప్పువేస్తే కరిగిపోతుంది. ఆ ఉప్పునీటి నుంచి ఉప్పును వేరు చేయలేము. ఉప్పునీటిలో ఏ భాగాన్ని రుచి చూచినా ఉప్పు రుచే ఉంటుంది. అంటే ఆ ఉప్పునీటిలో ఉప్పు సర్వవ్యాప్తమై ఉంది. అలాగే పరమాత్మ కూడా అనంతం, అపారం, విజ్ఞాన ఘనం. ఈ దేహం మూలంగా





ఆత్మ ప్రత్యేకంగా ఉన్నట్టు కనబడుతుంది. కానీ, దేహత్యాగం చేసిన తర్వాత నేను అనే భిన్న సంజ్ఞయే ఉండదు. అద్వైత భావమే మిగులుతుంది. తెలుసుకునేది. తెలుసుకునేవాడు వేరుగా ఉండరు.

ద్వైతభావం ఉన్నప్పుడే ఒకడు వేరొక దాన్ని వాసన చూస్తాడు. ఒకడు ఇంకొకదాన్ని కళ్ళతో చూస్తాడు. ఒకడు చెప్పినదాన్ని మరొకడు వింటాడు. ఒకడు ఇంకొకదాన్ని ఆలోచిస్తాడు. ఒకడు ఇంకొకదాన్ని తెలుసుకుంటాడు.

అద్వైతస్థితిలో, మరొకటి లేనప్పుడు, అంతా తానే అయినప్పుడు, ఎవడు దీన్ని వాసన చూస్తాడు? ఎవడు దేన్ని దర్శిస్తాడు? ఎవడు దేన్ని వింటాడు? ఎవడు ఎవడికి నమస్కరిస్తాడు? ఎవడు దేన్ని ఆలోచిస్తాడు? ఎవడు దేన్ని తెలుసుకుంటాడు? వాసన చూచేవాడు, చూడబడేది, దర్శించేవాడు, దర్శించబడేది, వినేవాడు, వినబడేది, నమస్కరించేవాడు. నమస్కరింపబడేవాడు, ఆలోచించేవాడు, ఆలోచించబడేది, తెలుసుకునేవాడు, తెలుసుకోబడేది ఏవీ ఉండవు. ఎవరూ ఉండరు. అంతా అద్వయం, అదే ఆత్మ.

# మానవుడు–దైవం

మిట్టమధ్యాహ్నం కావస్తోంది. ప్రచండంగా పరాక్రమిస్తున్నాడు సూర్య భగవానుడు. వృద్ధులైపోయిన ఏకనాథ మహారాజుల వారు మెల్లమెల్లగా అడుగులు వేస్తూ నదీతీరంవైపు వెడుతున్నారు. జీవితమంతా దైవనామ సంకీర్తనలతో, విధి ఆదరణ, సద్బోధలతో గడిపిన ధన్యజీవి ఏకనాధుల వారు. ఇటీవల కొంతకాలంగా వారు కాస్త నీరసించి వున్నారు. ఉదయాన్నే నదీస్నానం చేయడానికి రాలేకపోయినందుకు ఎంతో చింత చెందుతూ, ఎలాగైనా సరే స్నానం చేసి మరీ భోజనం చేయాలన్న పట్టుదలతో వారు అటువైపు వస్తున్నారు.

ఆ ఊరిలోని హరిజన యువతి మల్లిక. తన ఏడు నెలల పసిబిడ్డను

రాతి నీడలో పడుకోబెట్టి బట్టలు ఉతుక్కొంటోంది ఆమె. ఆమె భర్త దూర దేశాలు వెళ్లాడు. ఎప్పుడు వస్తాడో ఎలా ఉన్నాడో కబురేమీ తెలియలేదు. మల్లిక మనసంతా దిగులుగా ఉంది. బట్టలన్నీ ఉతికి, ఒడ్డునపెట్టి, స్నానం చేసింది మల్లిక. ఏ పనిచేస్తున్నా ఆమె మనసు భర్త మీదనే ఉండిపోయింది. పనికాగానే బట్టలున్న గంప తలమీద పెట్టుకొని ఇంటికి వెళ్లిపోతోంటే ఎదురైనారు ఏకనాధులవారు. ఆమె చటుక్కున దారి ప్రక్కకు తప్పకొని, వినయంతో తలవంచి నమస్కరించింది. చేయెత్తి దీవిస్తూ తరలి పోయారు ఏకనాథులు.

నదిలో దిగుతూనే ఆయన మనస్సు ప్రశాంతపడింది. మనసారా దైవ కీర్తన చేస్తూ తృప్తిగా స్నానం చేసి బయటకు వచ్చారు. ఒళ్లు తుడుచు కుంటుంటే విన్పించింది పసిబిడ్డ ఏడ్పు, చుట్టు చూస్తే మనుషులు ఎవరూ కన్పించలా జాగ్రత్తగా చూస్తే రాతిబండ ప్రక్కన దాన్ని తాకుతూ ఇసుకలో పసిబిడ్డ. అత్యంత సహజమైన మానవీయ కరుణతో పరుగునవెళ్ళి, ఆ బిడ్డను గుండెకు హత్తుకున్నారు ఏకనాథులు. ఇందాక తనకెదురైన ఆడ మనిషి బిడ్డ అయివుండాలి ఇది. పాపం ప్రక్కమీదనే పడుకోబెట్టినట్లుంది. బిడ్డ జరిగిపోయి ఎండలోకి వచ్చినట్లుంది. కింద కాలుతున్న ఇసుక, పక్కన ఎండకు రాయి తగిలేటప్పటికి అల్లాడిపోయింది. ఏకనాథుల వారు తడబడే అడుగులో గబగబా నడుస్తూ ఊరివైపు సాగారు.

ఇంటికి వెళ్లి బట్టలు ఆరవేయబోతుంటే గుర్తు వచ్చింది పాప మల్లికకు. భర్త ధ్యాసలోపడి బిడ్డను మర్చిపోవడమూ, అయ్యయ్యో ఎంత తప్ప జరిగిందీ! గబగబా నదివైపు పరుగుపెట్టింది. దారిలోనే ఎదురయ్యారు ఏకనాథులు. మల్లిక రెండుచేతులూ నోటి మీద పెట్టుకొని నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. సద్బ్రాహ్మణుడు ఆయన తన బిడ్డను తాకడమా, తెలియక తాకినా పాపమేగా అనుకున్నది మల్లిక. భయపడుతూనే వెళ్లి చేతులు చాపింది. “అంత ఎండలో మర్చిపోయావా తల్లీ పాపని”, ఎంతో కరుణార్ద్రంగా అంటూ బిడ్డను అందించారు ఏకనాతులు. సరిగ్గా ఆ దృశ్యం





ఆ ఊరి విప్రోత్తముల కంటపడనే పడింది. అయిదు నిముషాల్లో వార్త కార్చిచ్చులా పాకింది. ఏకనాథుల వారి ఇంటి ముందు చేరిపోయారు పెద్దలంతా.

ఏకనాథుల వారి కుమారుడు బయటకు రాగానే “మీ నాన్న ధర్మభ్రష్టు డయ్యాడు. ఏడీ, బయటకు రమ్మను” అన్నారు ఊరివారు. ఏకనాథుల వారీ కబురు వింటూనే బయటకు వచ్చి వారి ముందు సాష్టాంగపడి లేచారు. “సెలవివ్వండి స్వామీ! నా అపరాధం ఏమిటి?” అన్నారు. “ఏం తెలియనట్లు మాట్లాడతావేం! మాలపిల్లని ముట్టుకొని మైలపడి హాయిగా ఇంట్లో దూరతావా?” అన్నాడు పెద్ద తలకాయ.

“లేదు స్వామీ! నేను పెరట్లో స్నానం చేసి ఇంట్లోకి వచ్చాను” అన్నారు ఏకనాథులు.

“అంటే వెధవ భ్రష్టు పనులు చేసి స్నానం చేస్తే చాలా?”

“ఎండలో మాడిపోయే పసిబిడ్డను కాపాడటం తప్పా స్వామీ! సర్వజీవ రాశిలోనూ పరమాత్ముడుంటాడని మనందరికీ తెలిసిందే గదా!”

“ఓహ్హో అలాగా! అయితే ఇకనేం-గూడెంలోనే కాపురం పెట్టు” అన్నాడు మండిపడుతూ కుల పెద్ద, ఇంటిలోని ఆడవారు బావురుమని ఏడవ సాగారు. వెలిపెట్టిన వారి ఇంటికి ఎవ్వరూ రారు. చాకళ్లు, మంగళ్లు కూడా రారు. వీరి పిల్లలనెవరూ చేసుకోరు. వీరింటికి పిల్లనివ్వరు. అదో నరకం.

“నా స్థానంలో మీరున్నారుగానీ ఆ బిడ్డను రక్షించకుండా ఉండలేరు స్వామీ! ఓ పక్క రాలే రాయి, మరోప్రక్క కాలే ఇసుక. ఎలా వదిలిపెట్టగలం చెప్పండి. నన్ను పరమాత్ముడు క్షమిస్తాడా? అల్లాడే బాలకృష్ణుడు కాదా ఆ బిడ్డ!” ఆ మాటలు అంటూండగానే ఏకనాథుల కళ్లవెంట నీళ్లు ధారా పాతంగా కారిపోసాగాయి. భక్త్యావేశంతో ఆయన శరీరం వణికిపోతోంది.

“ఈ కబుర్లన్నీ ఆ గూడెంలో కూర్చొని ఆ చుట్టూ వాళ్లకు చెప్పకో.

తెల్లవారేటప్పటికి నువ్వు ఇల్లు దాటివెళ్లావా సరే-లేకపోతే నీ కుటుంబాన్ని వెలిపెట్టినట్లుననుకో" కఠినాతికఠినంగా శాపిస్తా అనేసి వెనక్కు తిరిగారు పెద్దలు.

సరిగ్గా అప్పడే వచ్చాడు ఓ కుష్ఠురోగి. దూరప్రయాణం చేసి వస్తున్నట్లుగా నలిగిపోయి ఉన్నాడు. కుష్ఠురోగిని చూడగానే ఒక అడుగు వెనక్కు వేశారు విప్రులంతా.

"ఎవడురా నువ్వు? ఎంత ధైర్యంగా జనం మధ్యకు వస్తున్నావు?" విసురుగా అన్నాడు ఒకాయన.

"అయ్యా క్షమించాలి" మాది కాశీ నగరం. ఈ వ్యాధి నన్ను పట్టుకొని ఏడాది అయింది. ఎన్నో మందులు తిన్నా తగ్గలేదు. చివరికి నా పేరిట విశ్వేశ్వరుడికి అభిషేకాలు చేయించాను. ఇదంతా జరిగి నెలరోజులు దాటిపోయింది, మొన్నరాత్రి నాకొక కల వచ్చింది. అందులో విశ్వేశ్వరుడు కనిపించాడు. నీవు ఏకనాథ మహారాజుల దగ్గరకు వెళ్ళు. ఆయన ఒక హరిజన బిడ్డను రక్షించిన పుణ్యఫలాన్ని నీకు ధారపోయమని అడుగు. ఆయనను నిన్ను తాకమని అడుగు. దానితో నీకు ఈ వ్యాధి పోతుంది" అని చెప్పారు. ఈ మాటలు వింటూ వికవిక నవ్వాడు ఒక విప్రోత్తముడు. "ఆఁ ఆఁ. ముట్టుకో. ముట్టుకో. ఆ రోగమేదో ఆయనకు కూడా అంటించు" అన్నాడు హేళనగా. ఆ రోగి రెండు చేతులూ జోడించాడు. "స్వామీ! నేను అసత్యం చెప్పడం లేదు. శివయ్య నిజంగా నాకు కలలో కన్పించాడు. అంతకుముందు ఏకనాథుల వారి పేరు వినటమే కాని ఆయన ఎక్కడ వుండేదీ కూడా నాకు తెలియదు ఇప్పడే వారినీ, వీరినీ అడిగి తెలుసుకొని వస్తున్నాను" ఆయన కళ్ళు నీళ్లతో నిండిపోయినాయి.

"అడుగో, ఆయనే. నువ్వు అడిగిన ఆ మహారాజు" అన్నాడు ఒకాయన వ్యంగ్యంగా. ఏకనాథ మహారాజు ముందుకు వచ్చారు. "ఆ పేరుతో నన్నే పిలుస్తారు నాయనా" అన్నాడు మెత్తని గొంతుతో, వెంటనే ఆయన ముందు సాష్టాంగపడ్డాడు కుష్ఠురోగి. లేచి ఏడుస్తూ "నేను నిజమే చెప్పాను స్వామీ"





అన్నాడు. ఏకనాథులు "నాయనా! నేను నిన్ను నమ్ముతున్నాను. ఆ బిడ్డను రక్షించినందుకు పుణ్యమే వస్తుందో, పాపమే వస్తుందో నేను ఆలోచించ లేదు. మనిషి చెయ్యవలసిన కర్తవ్యంగా మనసులో నుంచి కలిగిన ప్రేరణతో పాపను తెచ్చి తల్లికి అందించాను. ఒకవేళ దానివలన నిజంగా ఏదైనా పుణ్యం వస్తే-అది నీ వ్యాధిని తగ్గిస్తుందంటే-తప్పకుండా అది నీకే దక్కనీ" అన్నాడు అర్ద్రంగా అంటూనే ఆ కుష్ఠురోగి శిరస్సుపై చెయ్యి వుంచి ఆశీర్వదించాడు. మరుక్షణంలో ఒక అద్భుతం జరిగింది.

కుష్ఠురోగి శరీరంలోని వ్యాధి మాయమైపోయింది. బంగారువన్నెతో మెరిసిపోతున్న తన దేహాన్ని చూసుకొని ఆ కుష్ఠురోగే నమ్మలేకపోతున్నాడు. ఆ మహదానందంలో ఏకనాథుల వారి పాదాల మీద వాలిపోయాడు. ఆయన అతన్ని లేపి వీపు నిమిరి "విశ్వేశ్వరుడి కరుణ అపారమైంది నాయనా! ఆ భక్తిని విడువకు" అన్నారు.

ఇదంతా చూస్తున్న ఊరి వాళ్లకు మతిపోయినట్లైంది. ఒకాయన కాస్త జంకుతూనే "ఇదంతా కలా? నిజమా?" అన్నాడు.

"అయ్యా! ఏకనాథుల వారికి యింత శక్తి ఉందా?" అన్నాడు మరొకాయన సంశయిస్తూ.

"నా శక్తి ఏమీ లేదు స్వామీ! ఇదంతా పరమాత్ముని శక్తే. నన్నేలిన నా స్వామికి నా మీద గల అపారకరుణే అతని వ్యాధిని పోగొట్టింది" అన్నారు ఏకనాథుల వారు వినమ్రంగా. ఒక్కక్షణం నిశ్శబ్దంగా గడిచింది. హఠాత్తుగా గ్రామ పెద్ద ఏకనాథుల వారి పాదాలకు నమస్కారం చేశాడు. వెంటనే ఊరంతా అనుకరించింది అటుపైన అడిగారు ఏకకంఠంతో- "మేము మిమ్మల్ని ఎందుకు గ్రహించలేకపోయాము?"

ఏకనాథుల వారు ప్రేమ నిర్భరమైన కంఠంతో అన్నారు -

"నేను గొప్పవాడినేమీ కాదు స్వామీ! భగవంతుడు చెప్పినదేదో గుర్తు పెట్టుకొని నడుస్తున్నానంతే!"

## శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

అర్జునుడు ధనుర్బాణాలను, ఖడ్గాన్ని తీసుకొని అక్కడినుండి వేగంగా వెళ్లిపోయినాడు. చోరుల వెంటబడి వాళ్లను బంధించి, విప్రుని ఇంటి నుండి దోచిన వస్తువులను, గోవులను యజమానికి అందచేయించాడు. తరువాత ధర్మరాజు దగ్గరికి వెళ్లి తనను ఏడాదిపాటు తీర్థయాత్ర చేసి రావడానికి అనుమతించమని కోరాడు. నియమభంగం చేయవలసి వచ్చిన కారణం కూడా తెలిపాడు. ధర్మరాజు మనసు కలతచెందింది.

ధర్మరాజు అర్జునుణ్ణి సమాధానపరచి 'నీవు తెలిసి చేసిన దోషం కాదు. అసలు దోషమే కాదు. ఒక ఆర్తునికి సహకరించడం క్షత్రియోచిత ధర్మం. అందులో రాజ్య వ్యవ హర్తలకు చేసుకున్న విన్నపాలను తీర్చే సందర్భంగా ఏవైనా కొద్దిపాటి పొరపాట్లు జరిగితే అవి ఉపేక్షించదగినవే' నన్నాడు.

కాని అర్జునుడు అంగీకరించలేదు. భీముడు కూడా అర్జునునితో ఏకీభవించాడు. నియమాన్ని తెలిసి భంగపరచవచ్చు. తెలియకా భంగ పరచవచ్చు. అగ్నిస్పర్శలాంటిదది. నిప్పు నిప్పే. స్పర్శతో కాల్చక తప్పదు. నియమ భంగమైంది. కనుక ఏడాదిపాటు తీర్థయాత్రకు బయలుదేరాడు. ఆ తీర్థ యాత్రలలో అర్జునుడు నాగకన్య ఉలూచిని వివాహమాడాడు.

తూర్పున ప్రాగ్జోతిష్యం దాకా వెళ్లాడు. ప్రక్కనే ఉన్న మణిపురం వెళ్లి అక్కడి రాజు చిత్రవాహనుని కూతురు చిత్రాంగదను వివాహమాడాడు. అలా తిరుగుతూ దక్షణయాత్ర ముగించుకొని పశ్చిమాన ప్రభాసక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చాడు. ప్రభాసం సోమనాథుని దివ్యధామం. అలాగే





ద్వారకలో కృష్ణుని కూడా దర్శించుకోవచ్చు. దేవకీ వసుదేవులను సేవించ వచ్చు. బలరాముని ఆశీస్సులూ పొందవచ్చు.

పాండవులు ద్రోణాచార్యుల వద్ద చదువుకుంటున్నప్పుడు, వృష్ణి యువ కులు కొందరు ద్రోణాచార్యుని వద్ద విద్యలు నేర్వడానికి హస్తినకు వచ్చారు. రోహిణీ వసుదేవుల కుమారులలో సారణుడు, గదుడు కూడా వారిలో ఉన్నారు. ద్రోణుని వద్ద విద్యనభ్యసించే రోజులలో వారిరువురికీ అర్జునుని పట్ల ఆదరం ఏర్పడ్డది. అర్జునుడు తమకన్నా పెద్దవాడే. అప్పటికే ద్రోణశిష్యు లలో ప్రథమగణ్యుడైనాడు. అయినా అతని మధురమైన ప్రవర్తన, మాటలోని మమత్వం, చిన్నవాళ్ల పట్ల చూపే ప్రేమ, పెద్దల పట్ల చూపే గౌరవం వారిని ముగ్ధులను చేశాయి. అర్జునుడు వాళ్లకు ఆత్మీయబంధువైనాడు. ఆయన శాస్త్రపఠనంలో శస్త్రాభ్యాసంలో చిన్నవాళ్లకు ప్రేమతో ఎన్నో మెళకువలు నేర్పుతూండేవాడు.

సుభద్ర వారి చెల్లెలు. వసుదేవుల పుత్రిక. సుభద్ర పట్ల వారివురికీ ఎంతో అభిమానం, ప్రేమ. సుభద్రను అర్జునుడు వివాహమాడితే, ఆ జంట రతీమన్మథుల్లా ఉంటారని వారికి అనిపించేది. తమ చెల్లెల్ని గురించి వారు అర్జునునికి వర్ణించి చెబుతూండేవారు. క్రమంగా అర్జునుని గుండెలో సుభద్ర చోటు చేసుకున్నది. సుభద్ర అంటే కృష్ణునికి అపారమైన మాలిమి. బలరాముడు స్వయాన అన్న అయినా, సుభద్రకు కృష్ణుడంటే ప్రాణం. అతడంటే నమ్మకం పోగా కృష్ణుని భార్య సత్యభామకు, సుభద్రకు మొదటి నుంచీ స్నేహం. అనధ్యయనకాలంలో సారణ, గదులు ద్వారకకు వెళ్తుండేవారు. హస్తినలో తమ చదువులను గురించి ప్రసక్తి వచ్చినప్పుడల్లా అర్జునుని రూపవైభవాన్ని గురించి, పౌరుష పరాక్రమాలను గురించి, శాస్త్రాస్త్ర పాండిత్య గరిమను గురించి వర్ణిస్తుండేవారు. ముఖ్యంగా సుభద్ర సాన్నిధ్యంలో ఏదో నెపాన అర్జున ప్రసక్తి తెస్తుండేవాళ్లు. అలా సుభద్ర మనసులో పరస్పరం చూసుకోకుండానే అర్జునుని పట్ల అభిమానం

పాదుకొన్నది.

ఆ యాత్రా సందర్భంగా శ్రీకృష్ణుని కలుసుకోవడంతోపాటు, సుభద్రను కూడా చూడవచ్చు. వీలైతే మాట్లాడవచ్చు. తన ఎదను విప్పి చెప్పవచ్చు అని అర్జునుడు అనుకున్నాడు.

ప్రభాసక్షేత్రానికి అర్జునుడు సాధువుగా కాషాయ వస్త్రాలను ధరించి వచ్చాడు. తన రాకను ఎవ్వరూ గుర్తించరాదని అతని అభిప్రాయం. ఒకటి కృష్ణుణ్ణి ఏకాంతంగా కలుసుకోవచ్చు. రెండవది తన చిరకాల వాంఛ కూడా నెరవేరాలి.

శ్రీకృష్ణునికి అర్జునుడు వచ్చాడని తెలిసింది. ప్రభాసంలో ఒక మర్రి చెట్టు క్రింద తాపసిగా కూర్చున్నాడని విన్నాడు. శ్రీకృష్ణునికి ఎలాగైనా సుభద్రను అర్జునునికే ఇవ్వాలని భావం. ఏదో విధంగా వారిద్దరినీ ఏకం చేయాలి. పాండవ మధ్యముడు కారణజన్ముడు. తనకూ ఒక స్వప్నం ఎదుట ఉన్నది. యాదవ-పాండవ సమ్మేళన శక్తి ద్వారానే ఆనాటి అధర్మ ప్రవృత్తిని నిరోధించడం సాధ్యం. దానికి ఈ రెండు కుటుంబాలు ఏకం కావాలి. ఏ రూపంలోనూ దుర్యోధనునికి యాదవ సహకారం లభించ రాదు. బలహీనపక్షం ఒక బలరాముడే. సుభద్రను అర్జునుడు వివాహ మాడితే ఇహ కౌరవపక్షాన ఆయన నిలబడడం సాధ్యం కాదు. శ్రీకృష్ణుడు అర్జునునికి సుభద్రను కేవలం ప్రేమ కారణంగా కాకుండా రెండు వంశాల కలయికతో ఒక దృఢమైన కూటమిని నిర్మించవలసిన అవసరాన్ని గురించి ఉపదేష్టగా వివరించాడు. దానికి హృదయంతోటే కాకుండా, బుద్ధి కౌశలంతో వ్యవహరించాలని బోధించాడు.

'నీవిక్కడ ఎక్కువకాలం ఉండకూడదు. ద్వారకకు వెళ్దాం. అక్కడికి దగ్గరే రైవతకం ఉన్నది. అది ద్వారకకు వచ్చే సాధు, సజ్జనులకు, తాపసులకు విశ్రాంతి స్థలం. అక్కడికి ద్వారక నుంచి ఉగ్రసేనుల వారి కుటుంబం.

**(సశేషం)**





## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

## సాయీ కీ మహిమా

సాయీ కీ మహిమా హై అపరం పార్
బాబా కీ మహిమా హై అపరం పార్
తూ హరదమ గాయేజా, తూ హమదమ గాయేజా ॥ సా ॥

సాయి నాథ్ సే బడకర్ కోయీ
ఔర్ నహీ హై దూజా
సాయి (బాబా) కో ఇన్ దిల్ మే బిఠా కరు
కరులో ఉసకీ పూజా, తూహర దమగా యేజా ॥ సా ॥

(నామ హై) కి తనాసుందర్ దో అక్షర్ కా నామ్ హై సాయి
(బాబా) ప్యారా కరలో భరోసా ఏకదిన్ తుఝుకో
మిల్ జాయేగా కినారా, తూ హరదమ్ గాయే జాతూ ॥ సా ॥

సుమిరణ కరతే జో సాయీ కా (బాబా)
వో హి సభీ సుఖ పాతే
శిరడి వాలే కి తనా దయాళూ
కామ్ సభీ బన్ జాతే, తూ హరదమ్ గాయే జాతూ ॥ సా ॥

శీఘ్రు అపనే భక్తి భావసే
సాయి (బాబా)కో కరలో రాజీ
తో ఫిర్ సమఝో ఇన్ జీవన్ కీ
జీత్ గయే హో బాజీ తూ హరదమ్ గాయే జాతూ ॥ సా ॥

## భజనోం కీ ధూమ్

సాయీ తుమ్హారే భజనోం కీ ధూమ్ మచీ హై ఘర్ ఘర్ మే
బాబా తుమ్హారే భజనోం కే ధూమ్ మచీ హై ఘర్ ఘర్ మే
బస్ తుమహీరే తమ ఆతే హెూన జర హర్ ఏక్ ప్రాణీ అంతరమే
॥ సా ॥

కోయి కహతా ముజే శ్రీరామ మిలే, కోయీ కహతా ముజే రహీమ్ మిలే
కోయి కహతా ముజే శ్రీకృష్ణ మిలే, కోయి కహతా ముజే కరీమ్ మిలే
మైతో బికారీ బన్ కరకె ఆతేహై తుమ్హారా మందిర్ మే ॥ సా ॥

కోయి కహతా హై మహాసంత్ మిలే, కోయి కహతే హై భగవంత్ మిలే
కోయి కహతా హై శ్రీ దత్త మిలే, కోయి కహతే హై హనుమంత్ మిలే
ఝూమ్ ఐసీ రహీ దునియా మాన్, తుఫాన్ ఉఠావో సాగర్ మే
॥ సా ॥


గోదు కిస్‌కీ భరిదీ తుమనే, ఔర్ కిసీకీ భరీదీ ఝోలీ
ధన్య హువా వో ప్రాణి జిసపర్ తుమనే రహమ్ నజర్ హై కరదీ
హర్ ప్రాణీ తుమ్హారే గుణ గాతే ఆ కరకే ఖుషీ కీ లహర్ మే ॥సా॥

ఏక్ భకత్ అబ్ షిరిడి ఆకర్ చరణోంసే హి లిపట జాయే అబ్
ఏక్ తుమ్హారే నామ్ బినా కోయీ శీర్ష సుజానా దిల్ కో బాయి
పూలోంకి జగా హై శబ్ద భరే ఇస్ అదర్ కీ చాదర్ మే ॥ సా ॥

**(సశేషం)**







## సాయిభక్త దాసగణు

రచన : విజయ కిశోర్

**(గత సంచిక తరువాయి)**

అక్కడ రాముడు స్వీకరించింది ఎంగిలి చేసిన ఆ పండ్లను కాకుండా భక్తురాలి హృదయంలోని మధుర భక్తి భావనను మాత్రమేనని, మనకు బోధ పడుతుంది. అయినా ఎవరి భక్తి గొప్పదో, ఎవరి భక్తి గోరంతదో చెప్పే యోగ్యత, సామర్థ్యం ఆ సద్గురు నాథునికి తప్ప అన్యులకు లేదు. అందుకనే మరపుతో పారమార్థిక ప్రవాసం నుండి ప్రక్కదారి పట్టిన మనసును సరి చేసే ప్రక్రియలో భాగంగా, బాబా దాసగణుని **"వెళ్ళి రాధాకృష్ణాఆయికి క్షమాపణ చెప్పమని"** ఆదేశించారు. తప్పు తెలుసుకున్న దాసగణు అలానే చేశాడు.

దాసగణు వంటి హరిభక్త పరాయణుడు, రాధాకృష్ణాఆయి వంటి సిద్ధురాలి విషయంలో సరే కానీ, మరి సాధారణ భక్తుల సంగతేమిటి? అనే సందేహం ఇక్కడ కలగడం సహజం, సమంజసం. సందేహ నివృత్తి కోసం, శ్రీ సాయి చరిత్రను కొంచెం నిశితంగా పారాయణ చేయాలి. ఎందరో భావికులైన భక్తులు శ్రీ సాయి చరణాల చెంత భావోద్వేగంతో, తెలియని తన్మయత్వంతో తమను తాము మరచిన సంఘటనలు సాయి చరిత్రలో కోకొల్లాలు! కొన్ని ఉదాహరణలు ....

ఒక్క మహాల్సాపతిని మినహా ఇంకెవరినీ తమ నుదిటిపై చందనం రాయడానికి అనుమతించని బాబా, డాక్టర్ పండిట్ బాబా స్థానంలో తన గురువుని దర్శించుకొని, తెలియని తన్మయత్వంతో బాబా నుదుటిపై చందనం వ్రాస్తే, బాబా అనుమతించడంలోని అంతరార్థం డాక్టర్ పండిట్ అంతర్ముఖత పట్ల ఆనందించడం వలనే! అదే, పూజాతంతులో భాగంగా బాబాకు చందనం రాయడానికి ప్రయత్నించిన భక్తులను బాబా

నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. బాబాకు - వాస్తవానికి ఏ సద్గురువుకైనా- కావలసింది యాంత్రికమైన తంతు కాదు, హృదయ తంత్రుల నుండి జనించే (అంతర్ముఖమైన స్థితిలో) భక్తి రాగ రంజితమైన తన్మయత్వం!

చోళ్కర్ అనే భక్తుడు శాఖాపరమైన పరీక్షలో ఉత్తీర్ణుడై, తన ఉద్యోగం దీర్ఘకాలికమైనట్లయితే (పర్మనెంట్) శిరిడీ వచ్చి బాబాను దర్శించుకొని, కలకండ పంచిపెడతానని మ్రొక్కుకున్నాడు. బాబా కృపతో తాను కోరుకున్నట్లుగానే జరిగింది. తనకు అత్యావశ్యకమైన ఉద్యోగాన్ని అనుగ్రహించిన బాబా పట్ల హృదయం అంతా కృతజ్ఞతా భక్తిభావాలు నిండిపోయుండటం మరియు సాధ్యమయినంత త్వరగా బాబాను దర్శించుకొని మ్రొక్కు తీర్చుకోవాలనే తన దృఢ సంకల్పం ముందర తీపి లేని తేనీరు సేవించడం తనకు కష్టమనిపించలేదు. ఒకవేళ అనిపించినా ఖాతరు చేయలేదు. కానీ తనను అనుగ్రహించిన సద్గురువుని దర్శించుకోవడం కోసం తాను పడిన తపన చేసిన త్యాగం అనే మధురమైన భక్తి భావనలను సద్గురువు మాత్రం ఎంతో ఇష్టంగా స్వీకరించాడు. ఆ విషయాన్నే చోళ్కరుకు తమదైన శైలిలో తెలియజేస్తూ, చోళ్కరుకు శిరిడీలో అతిథ్యమిచ్చిన దాదాకేల్కరుతో **"నీ అతిథికి తేనీటిలో చక్కెర అధికంగా వేసి ఇవ్వు"** అని అన్నారు. బాబా యొక్క సర్వాంతర్యామిత్వాన్ని, సర్వసాక్షిమత్వాన్ని అనుభవింపచేసే ఆ మాటలు చెవిన పడిన క్షణంలో చోళ్కరు హృదయంలో జరిగే ఆనంద హేలను వర్ణించాల్సిన అవసరం లేదు. సులభంగానే ఊహించుకోవచ్చు. తన్ను తామరచిన తన్మయత్వం తనకు కలిగిందనే సత్యానికి, తన కనుల నుండి జాలువారిన ఆనందాశ్రువులే సాక్ష్యంగా నిలుస్తాయి. తనకు కలిగిన ఆ అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభవం స్ఫురణకు రాగానే చోళ్కర్ అంతఃకరణం సాయి స్మరణలో స్థిరమవుతుందనే విషయంలో ఎటువంటి అనుమానానికి తావు లేదు.

**(సశేషం)**





# శ్రద్ధాంజలి



**పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ మహారాజుల వారి ప్రేమకు పాత్రులైన ఆశ్రమ నిర్మాణంలో తమ అనుభవాన్ని జోడించి ఎన్నో భవనాలకు ఇంజనీర్‌గా సేవలందించిన మా ఆశ్రమ శ్రేయోభిలాషులు మృదు స్వభావి, స్నేహశీలి "శ్రీ రవీందర్ రావు"గారు (73 సంవత్సరాలు) సాయిలో ఐక్యమయ్యారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మనసారా ప్రార్థన చేస్తూ .... వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.**

**ఇట్లు,**

**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్**

**సాయిధామం**

# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani"**.

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam, Yadadri Bhuvanagiri Dist- 508 126 |

I, Sri Ramananda Prabhuji declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2023

Sd/-

Sri Ramananda Prabhuji





# భోగత్యాగంతో బ్రహ్మానందం

**- స్వామీ జ్ఞానదానంద**

ఒకచోట బెస్తలు చేపలు పడుతున్నారు. దూరంగా ఎక్కడినుంచో ఓ గద్ద వచ్చి చటుక్కున ఓ చేపను నోట కరచుకొని వెళ్లిపోయింది. అలా చేపను పట్టుకొని వెళ్లిపోతున్న గద్దను కాకుల గుంపు చూసింది. వెంటనే వందలాది కాకులు ఆ చేప కోసం దానిని తరుమసాగాయి. 'కావ్, కావ్' అని అరుస్తూ దాన్ని చుట్టుముట్టాయి. గద్ద దక్షిణం కేసి ఎగిరితే, కాకులూ దక్షిణం వైపుకు వెళ్లాయి; ఉత్తరం వైపునకు వెళితే, అవి కూడా ఉత్తరం వైపుకు వెళ్లాయి. తరువాత గద్ద పాపం! తూర్పు, పడమర దిశల్లో కూడా ఎగిరి చూసింది. ఎటు పోయినా, కాకుల గుంపు మాత్రం వెంబడించడం మానలేదు. వాటిని తప్పించుకునేందుకు గరుడపక్షి విశ్వ ప్రయత్నం చేస్తూ, ఆ హడావిడిలో నోటి నుంచి చేపను జారవిడుచుకుంది. అంతే! ఒక్కసారిగా కాకులన్నీ చేప పడ్డ చోటుకేసి దూసుకుపోయాయి; గద్దను వదిలేశాయి. అప్పుడు ఆ పక్షి నిశ్చింతగా ఓ చెట్టుపై కూర్చొని తనలో తాను 'ఈ చేపే కదా, ఇంత గందరగోళానికి కారణం. ఇప్పుడు ఆ చేపా నా చెంత లేదు; చింతా నా చెంత లేదు' అనుకుంది.

మనిషి జీవితమూ అంతే! భోగాలనే చేపను పట్టుకున్నంత కాలం, కష్టాలనే కాకులు, కర్మలనే కాకులు వెంబడిస్తూనే ఉంటాయి. వాటి వల్ల చింత, విచారం, అశాంతి కూడా వెన్నంటే వస్తాయి. ఇలా భోగాల కోసం పరుగెత్తకుండా పరిమిత వనరులతో ప్రశాంతంగా ఉండమని ప్రబోధిస్తూ...

**సురమన్దిర తరుమూల నివాసః, శయ్యా భూతల మజినం వాసః।**

**సర్వపరిగ్రహ భోగత్యాగః, కస్య సుఖం న కరోతి విరాగః॥**

అంటున్నారు 'భజ గోవిందం' పరంపరలో శంకర భగవత్పాదుల శిష్య

ప్రముఖులు నిత్యానందులు. దేవాలయాల్లో ఏదో ఒక చెట్టు కింద నివసిస్తూ, నేల మీద పడుకుంటూ, లేడి చర్మాన్నే ధరిస్తూ, అన్నీ వదలిపెట్టుట, భోగాలను కోరని విరాగికి ఇక సుఖం ఎందుకు లభించదని ప్రశ్నిస్తున్నారు. ఈ రోజు మనిషి జీవితం అతి దుర్భరంగా మారడానికి ప్రధాన కారణం భోగలాలసే!

**అవసరాన్ని మించిన ఆరాటం :** నిజానికి ఒకటి తరువాత మరొకటి ఊరిస్తూ, ఉరుకులు పెట్టిస్తూ, భోగాలు మనల్ని అవసరాన్ని మించి ఆరాటపడేలా చేస్తున్నాయి. అందుకే భర్తృహరి 'భోగాలను నేను అనుభవించడం లేదు; అవే నన్ను అనుభవిస్తున్నాయ'ని బాధపడుతూ, 'భోగా న భుక్తాః వయ మేవ భుక్తాః' అంటాడు. ఇల్లూ, వాకిలీ వదిలేసి మనుషులంతా చెట్లూ, పుట్టలు, గుళ్ళూ గోపురాల వైపు వెళ్ళమని నిత్యానందుల ఉద్దేశం కాదు. కానీ, శాశ్వతమైన ఆనందాన్ని సంప్రాప్తించుకునే మార్గంలో వీలయినంత వరకు బాహ్యభోగాలకు సంబంధించిన వస్తువులపై అనురక్తిని తగ్గించుకోమంటున్నారు. మనం ధరించే దుస్తులు, వినియోగించే వస్తువులు, విహరించే వాహనాలను బట్టే మనకు విలువ ఉంటుందని చాలామంది భ్రమపడుతూ ఉంటారు; ఇది పొరపాటు.

ఒకసారి భగవాన్ రమణ మహర్షుల వారు భౌతికంగా జీవించి ఉన్న కాలంలో, ఆశ్రమంలో ఒక ఉత్సవం జరిగింది. భోజనవేళ కాగానే నిర్వాహకులు 'ప్రముఖులందరికీ ముందుగా వడ్డన జరుగుతుంది. బైరాగులు, బికారులు బయట కూర్చోండి; తరువా పంక్తిలో పిలుస్తాం' అంటూ రమణుల కోసం వెతికారు. కానీ మహర్షి ఎక్కడా కనిపించలేదు; బయట ఎక్కడో బైరాగుల మధ్య కూర్చున్నారు. 'ఇదేంటి మహాత్మా! మీ కోసం న్యాయమూర్తులు, పురప్రముఖులు వేచి చూస్తున్నారు' అన్నారు నిర్వాహకులు. 'బైరాగులు, బికారులు తరువాత పంక్తిలో అన్నారుగా! అందుకే తరువాత పిలుస్తారనుకొని నేను బయటకు వచ్చాను' అన్నారు





భగవాన్ రమణులు. భోగాలను త్యజించి, కౌపీనం ధరించినంత మాత్రాన వారి విలువ ఏమైనా తరిగిపోయిందా! అందుకే 'ఆడీ' కారులో వెళుతున్నామా? ఆటోలో వెళుతున్నామా? అన్నది కాదు ప్రధానం; అంతరంగంలో ఎంత ఆకళంకంగా, ఆనందంగా ఉన్నామన్నదే ప్రమాణం.

మానసిక పరిత్యాగం మేలు : ఆధునిక ప్రపంచంలో మునుల్లా, పరివ్రాజకుల్లా సర్వసంగ పరిత్యాగ జీవనం సాధ్యం కాకపోవచ్చు. కానీ, భౌతకంగా వస్తువాహనాల మధ్య ఉంటూ కూడా మానసికంగా వాటితో మమేకం కాకుండా జీవించే ప్రయత్నం చేయాలి. ఆయా సుఖాలను అనుభవించడం వేరు; అదే పనిగా వాటికి అలవాటు పడటం వేరు. అన్నీ ఉన్నా అప్పుడప్పుడూ వాటికి దూరంగా సాధారణ జీవనం గడుపుతూ ఉంటే, కాలక్రమంలో అవి మనపై అజమాయిషీ చేయకుండా, బాహ్య సుఖాలు మన ఆధీనంలో ఉంటాయి. శ్రీమద్భాగవతంలో అజగర మౌని ప్రహ్లాదుడితో తన ఆనంద రహస్యాన్ని ఇలా చెబుతాడు;

**లేదని ఎవ్వరి నడుగను, రాదని చింతింప పరులు రప్పించినచో**

**కాదనియెద్ది మానను, ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్**

'లేదని నేను ఎవరినీ యాచించను; లభించలేదని చింతించను. పరులు ఏదైనా పంపితే దానిని కాదనను. ఏదీ మానను; ఏదీ కోరను. ద్వేషం లేదు, ప్రేమా లేదు; సుఖం లేదు, దుఃఖమూ లేదు. ఈ విధంగా జీవితాన్ని లీలా వినోదంగా గడుపుతున్నా'నని చెబుతాడు. లౌకికులైన వారు సుఖాలకూ, సౌకర్యాలకూ అలవాటు పడకుండా ఇలా వాటితో అంటీముట్టనట్టుగా వ్యవహరించాలి. అదే సమయంలో భోగాలకు అనుబంధంగా వచ్చే అసౌకర్యాలకు కూడా మనస్సును సిద్ధం చేసుకోవాలి. ఆవగింజంత నిరాశ కూడా ఎదురుకాకూడదంటే అసలు భోగాలకే దూరంగా ఉండాలి.

**ప్రియాప్రియాలతోనే పరితాపం :** వస్తువు ద్వారా, వ్యక్తి ద్వారా మన జీవితంలో సుఖం ప్రాప్తిస్తోందంటే, దాని కాలపరిమితి కూడా ఆ వస్తు

వంత, వ్యక్తి అంత పరిమితమైనదేనని గుర్తు పెట్టుకోవాలి. అల్పమైన దాని నుంచి అనల్పమైన ఆనందాన్ని ఎలా పొందగలం? అరలీటరు నీళ్ళుండే కొబ్బరి బొండాం నుంచి అయిదు లీటర్ల కొబ్బరినీళ్లను ఆశించడం ఎంత అవివేకమో, ఆయా వస్తువుల నుంచి వ్యక్తుల నుంచి అపరిమితమైన సుఖసంతోషాలను ఆశించడం కూడా అంతే అవివేకం. అందుకే గౌతమ బుద్ధుడు ...

**తస్మాత్ ప్రియం న కుర్యాత్, ప్రియాపాయో హి పావకః ।**

**గ్రంథాః తేషాం న విద్యంతే, యేషాం నాస్తి ప్రియాప్రియమ్ ॥**

'ప్రియమైన వాళ్ళ వియోగం దుఃఖం మిగులుస్తుంది. కనుక ప్రియంగా ఎవరినీ భావించవద్దు. ఎవరికైతే ప్రియాప్రియములు లేవో వారే బంధనాలు లేనివారవుతార'ని హితవు పలుకుతాడు.

అదే విధంగా ఏ వస్తువు పట్లా అప్రియాన్ని కూడా పెంచుకోవద్దు. మనం చాలా సందర్భాల్లో కొందరంటే అమితమైన ప్రేమను కురిపిస్తాం. మరికొందరిని అసలు దగ్గరకు కూడా రానివ్వం. వాళ్లను చూడగానే ముఖం పక్కకు తిప్పేసుకుంటాం. ఈ ధోరణి కూడా మంచిది కాదు. ప్రియమైన వాళ్ళ సహవాసం కూడదు. అప్రియమైన వాళ్ళ సహవాసమూ కూడదు. ప్రియమైన వాళ్లను చూడలేని పరిస్థితి ఎదురైనప్పడు బాధ కలుగుతుంది. అప్రియమైన వాళ్లను విధి లేక చూస్తూ ఉండవలసిన పరిస్థితి కూడా బాధగానే ఉంటుంది. అందుకే మానసికంగా విరాగిగా, ఏకాంతంగా జీవించడం అలవాటు చేసుకోవాలి.

**ఎంతకాలమీ భోగాలు? :** 'ఏముంది ఈ కామినీ కాంచనాలలో! ఎంత అనుభవించినా వీటిపై వెగటు పుట్టడం లేదే! ఈ సుఖాలు ఇప్పుడు ఉంటాయి; మరుక్షణంలో కనుమరుగైపోతాయి. అవన్నీ క్షణభంగురమే' అంటూ సత్త్వగుణ స్వభావులు ప్రశాంతంగా ఉంటారు. దొరికిన వస్త్రాన్ని ధరిస్తారు. కడుపునకు సరిపడేంత మేరకే సంపాదిస్తారు. అలాంటివారు





త్వరగా భగవంతుడికి దగ్గరవుతారనేవారు శ్రీరామకృష్ణ పరమహంస.

భోగవాసన అంత సులువుగా మనస్సు నుంచి విడివడదు. అంతకు మించిన రుచి ఏదో, ఆనందమేదో మనస్సుకు చూపాలి. అప్పడే తుచ్ఛమైన వాటి కోసం అది వెంపర్లాడదు. అలాంటి ప్రయత్నమేమీ చేయకపోవడం వల్లనే మనిషి, సాధారణ సుఖాల స్థాయిని మించి ఉన్నతంగా ఆలోచించ లేకపోతున్నాడు. భగవత్ సంబంధమైన ఆనందం కోసం తపించలేకపోతు న్నాడు. పైగా భయాల మధ్యే భోగాలను అనుభవిస్తూ, తనువును చాలిస్తు న్నాడు. అందుకే భర్తృహరి ...

**భోగే రోగభయం, కులే చ్యుతి భయం, విత్తే నృపాలాద్భయమ్**
**మానే దైన్యభయం, బలే రిపుభయం, రూపే జరాయా భయమ్**
**శాస్త్రే వాదభయం, గుణే ఖలభయం, కాయే కృతాంతాద్భయమ్**
**సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం, వైరాగ్యమేవాభయమ్**

'భోగాలను అనుభవించేవాడికి రోగాలు వస్తాయనే భయం ఉంటుంది. ఉన్నతకులంలో పుట్టినవాడికి వెలివేస్తారనే భయం, ధనువంతుడికి రాజభయం, పరువుగా బ్రతుకుతున్నవాడికి పరువు పోతుందన్న భయం, బలం గల వాడికి శత్రువుల భయం, అందమైన వారికి ముసలితనమంటే భయం, పండితుడికి వాదంలో ఓడిపోతానన్న భయం, మంచివారికి చెడ్డ వారి వల్ల భయం, శరీరానికి మృత్యుభయం ఉంటాయి. వైరాగ్యం ఒక్కటే ఈ భూమిపై నిర్భయత్వాన్ని ప్రసాదిస్తుంద'ని స్పష్టం చేశాడు.

బొమ్మలతో ఆడుకుంటున్నంత కాలం తల్లి పిల్లాడి దగ్గరకు రానట్లే, భోగాలతో కాలం గడుపుతున్నంత కాలం భగవంతుడు మనవైపు చూడడు. బ్రహ్మజ్ఞానాన్నీ, బ్రహ్మానందాన్నీ ఇవ్వజాలడు. ఏ మాత్రం విలువలేని రంగు రాళ్లనే అపురూపంగా భావించుకుంటూ, భద్రంగా బీరువాలో దాచుకొని మురిసిపోతుంటే, రత్నాలు తెచ్చి మన చేతిలో ఎవరు పెడతారు? ముందు రాళ్లను వదిలేయాలి; అప్పడే రత్నాలు వచ్చి మన చేతిలో పడతాయి.

# మాతృసంస్థ కబుర్లు

జనవరి 12వ తేదీ స్వామీ వివేకానంద 161వ జయంతి. ఈ రోజునే జాతీయ యువజన దినోత్సవంగా స్వామీ వివేకానంద జన్మదిన వేడుకలు శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు వివేకానందుని గూర్చి ఉపన్యాసాలు, సూక్తులు వివరించారు. భవిష్యత్తరాలకు వారు మార్గదర్శి, ఉక్కు నరాలు, ఇనుప కండరాలు, వజ్ర సంకల్పం - ఈ మూడు యువత నుంచి వారు ఆశించారు. “లేవండి, మేల్కొండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి” అని యువత గూర్చే చెప్పేవారని విద్యార్థులంతా వారి వారి అభిప్రాయాలు వెలిబుచ్చారు.

శ్రీ సాయిదత్త పీఠం సాయిధామం ద్వితీయ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు విద్యార్థులను ఉద్దేశించి వివేకానందుని గూర్చి ఎన్నో అమూల్యమైన విషయాలు యిలా వివరించారు -

నిద్రాణమై ఉన్న యువతను స్వామి వివేకానంద మేల్కొలిపినారు. ఆధునిక యువతపైనే వివేకానందుల వారి విశ్వాసం వారు నిర్మించిన ఆదర్శాన్ని దేశమంతా వ్యాప్తి చేసేది ఒక యువత మాత్రమేనని, అలాంటి యువత ముందు బలిష్టంగానూ, జవసంపన్నులుగానూ మారాలి. ఇలాంటి యువత 10మంది ఉన్న చాలు. ఈ ప్రపంచాన్నే మార్చేయవచ్చు. మిమ్మల్ని మీరు శక్తివంతులుగా భావించండి. సమస్త శక్తులు మీలోనే ఉన్నాయనుకోండి. అదే వజ్రసంకల్పంతో కొండను కూడా పిండి చేయగలరు. తన అద్భుత ప్రసంగాలతో పాశ్చాత్యుల హృదయాలను సైతం చూరగొన్న భారతీయ తత్త్వవేత్త, గొప్ప మేధావి స్వామి వివేకానంద. కాబట్టి





మనం అందరం వారి వారసులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించి భారతదేశ గౌరవాన్ని నిలబెడదాం అంటూ ప్రసంగాన్ని ముగించారు.

జనవరి 13వ తేదీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గానుగాపూర్ దత్తాత్రేయ స్వామి వారి దర్శనానికి పూజ్య స్వామి శ్రీ రామానంద ప్రభుజీ వారు, వారి శిష్య బృందం తరలివెళ్ళారు. మార్గమధ్యంలో కర్నాటక సరిహద్దులో ఉన్న బీదర్ లక్ష్మీ నరసింహస్వామిని నీటిలో నడుచుకుంటూ దర్శించు కొని, ఆలయ విశిష్టత తెలుసుకొని అక్కడి నుండి బయలుదేరి మార్గ మధ్యమున స్వామి సమర్థ ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమంలో భోజనాలు చేసి మళ్ళీ ప్రయాణం మొదలుపెట్టారు.

భారతదేశంలో గానుగాపూర్ అత్యద్భుతమైన ప్రసిద్ధ ఆధ్యాత్మిక ప్రదేశాలలో ఒకటి. ఈ ఆలయంలో దత్తాత్రేయ స్వామి మరియు శ్రీ నర సింహ సరస్వతి స్వామి ఒకే అవతారంగా అగుపిస్తారు. ఈ క్షేత్రానికి చేరుకునేటప్పటికి సాయంత్రం 4 గం. అయ్యింది. కొంత సమయం సేదతీర్చుకున్న అనంతరం అవరజ, భీమా నదుల సంగమంలో స్నానాలు ఆచరించి నిర్గుణ్ మఠం చేరుకున్నాం. ఈ ఆలయంలోగల అశ్వత్థ వృక్షం చాలా మహిమాన్విత మైనది. ఎవరైతే ఈ సంగమంలో స్నానమాచరిస్తారో వారు పాపాల నుండి విముక్తి పొంది కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఇక్కడ నృసింహ సరస్వతి స్వామి వారి శిలా పాదుకలు ఉన్నాయి. అచట స్వామీజీ గారు, వారి శిష్యులు జపము, ధ్యానము, ప్రదక్షిణలు పారాయణ మొదలైనవి పూర్తి చేసుకొని దత్తాత్రేయుల వారి దర్శనానికి బయలుదేరారు.

ఆలయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉండటంతో దత్తాత్రేయుల వారి దర్శనం తొందరగా అయింది. అందరిలో ఏదో తెలియని కొత్త శక్తి

వచ్చినట్టుగా అనిపించింది. మనసంతా ప్రశాంతంగా ఏ ఆలోచనలు లేకుండా అయిపోయింది. ఆ స్వామిని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది. రాత్రి అక్కడే గడిపి 14వ తేదీ తెల్లవారుఝామునే దత్తాత్రేయుల వారిని మరొకసారి కనులారా దర్శించుకొని అక్కడి నుండి అక్కల్‌కోటకు బయలుదేరి వెళ్ళాం. అక్కల్‌కోట మహారాజుగా ప్రాచుర్యం పొందిన శ్రీ స్వామి సమర్థ అపర దత్తావతారంగా భక్తులు పూజిస్తారు. అక్కల్‌కోటలో వారి సమాధి, ఆలయం ఆరాధనీయ స్థలాలుగా ఉన్నాయి. స్వామి వారిని దర్శించుకొని కొంత సమయం జపధ్యానాలు చేసుకొని తిరుగుప్రయాణం అయ్యాము.

స్వామి శ్రీ రామానంద ప్రభుజీవారు మరియు శ్రీ చంద్రారెడ్డిగారు తిరుపతి వశిష్టాశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వస్వరూపానందగిరి స్వామీజీ ఆహ్వానం మేరకు జనవరి 24, 25, 26 తేదీల్లో ఆశ్రమ వార్షికోత్సవాలలో పాల్గొన్నారు. సభా కార్యక్రమం ఆద్యంతం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాధు సమ్మేళనంలో పలువురు సాధు మహాత్ములు తమ దివ్యప్రవచనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామానంద ప్రభుజీ వారు మాట్లాడుతూ గురువు యొక్క ఆవశ్యకతను, గురువుకు శిష్యుడు సర్వ సమర్పణ భావంతో ఎలా మసులుకోవాలో ఆద్యంతం గురువు శిష్యున్ని ఏ విధంగా కాపాడుతూ మోక్షపథం వైపు నడిపిస్తారో సవివరంగా వివరిస్తూ 'మురళి' కథ ద్వారా వివరించారు. ఏ సాధకుడికైనా మూడు సకారాలు ఉండాలని - 1) సంకల్పం, 2) సన్నద్ధత, 3) సాధన. ఈ మూడు లక్షణాలు ఉంటేనే ఏదైనా సాధించ గలమని వివరించారు. శ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు చూపిన త్రోవలోనే వారి శిష్యులైన శ్రీ రామానంద ప్రభుజీ నడుస్తూ ఆశ్రమాన్ని చాలా సమర్థ వంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడుతూ స్వామీ





రామానంద ప్రభుజీ వారిని సత్కరించారు.

2023 జనవరి 26వ తేదీన 74వ గణతంత్ర దినోత్సవం శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో నిర్వహించబడింది. వన్నెవన్నెల రంగులతో, పుష్పాలతో పాఠశాల ఆవరణం తీర్చిదిద్దబడింది. ఉదయం గం.8.30 ని.లకు విద్యార్థినీ విద్యార్థులంతా భారతమాత స్థవం చేస్తూ భారతమాత మంది రాన్ని దర్శించి, అమ్మకు వందనాలు సమర్పించారు. మా పాఠశాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీ భేతి కన్నయ్యగారు, ఆర్.ఎస్.ఎస్. విభాగ్ శారీరక్ ప్రముఖ్ మరియు శ్రీ బొమ్మకంటి మల్లేశం గారు, జిల్లా గ్రామ వికాస్ ప్రముఖ్ ఆర్.ఎస్.ఎస్. భారతమాతకు పుష్పాలంకరణ చేసినారు. గం.9.00 లకు పాఠశాల ఆవరణలో పతాకావిష్కరణ కార్యక్రమం శ్రీ భేతి కన్నయ్య గారి చేతుల మీదుగా జరిగింది. పతాక వందనం తరువాత విద్యార్థులు దేశభక్తి గేయాలు ఆలపించారు. నాటికలు, నృత్యాలు చేశారు. ఉపన్యాసాలు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి హనుమత్ జ్యోతిగారు గణతంత్ర దినోత్సవం గురించి వివరించారు. భారత రాజ్యాంగం భారత దేశానికి సర్వోత్కృష్ట చట్టం. భారత రాజ్యాంగం ద్వారా భారతదేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని అమలుపరిచిన నాటి నుండి స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. అందువల్ల ప్రతి సంవత్సరం జనవరి 26ను గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటా మని వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ కన్నయ్య గారు విద్యార్థులను ఉద్దేశించి ఇలా ఉపన్యసించారు - హైదరాబాద్ సంస్థానాధీశుడు, ఏడవ నిజాం నవాబ్ ఉస్మాన్ ఆలీఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుండి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణా విమోచనోద్యమంగా పిలుస్తారు. భారతదేశానికి

స్వాతంత్ర్యం వచ్చినా నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. దేశమంతా స్వాతంత్ర్యో త్సవాలలో ప్రజలు ఆనందంతో గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు నిరంకుశ, బానిసత్వంలో కూరుకుపోయారు. మానవ రక్తాన్ని తాగే రాకాసి మూకలైన రజాకారు దళాల దురాగతాలకు అంతు ఉండేదికాదు. నాడు వేలమంది మహిళలు మానభంగాలకు గురయ్యారు. హిందూ మహిళల్ని నగ్నంగా బతుకమ్మ ఆడించేవారు. నిజాం పాలకులు ఉద్యమాలను ఆప డానికి ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేసేవారు. గోళ్ళ క్రింద గుండుసూదులు, బ్లేడ్లతో శరీరాన్ని కోసి కారం చల్లడం, సిగరెట్లతో కాల్చడం, బొటనవేళ్ళకు తాళ్ళుకట్టి తలక్రిందులుగా వేలాడదీయడం, చెవులకు బరువులు కట్టడం లాంటి భయంకర పరిస్థితులను ప్రజలు సహించలేక పోయారు. నవాబు హీనమైన బతుకు బతుకుతున్న ప్రజల గురించి పట్టించుకోకుండా ప్రజల నుండి వసూలు చేసిన సొమ్ముతో విలాసాలు, జల్సాలు, భోగభాగ్యాలు చేసుకునేవారు. దీనితో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమయ్యాయి. తెలంగాణా పోరాట యోధులు శ్రీయుతులు రావి నారాయణరెడ్డి, దాశరథి రంగాచార్య, కాళోజి నారా యణరావు, సురవరం ప్రతాపరెడ్డి వీరి సారథ్యంలో 1948లో సాయుధ పోరాటం ఉధృతరూపం దాల్చి చివరికి అప్పటి హోంమినిస్టర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి చొరవతో భారత ప్రభుత్వం సైనిక చర్య జరిపి నైజాం సంస్థానాన్ని సెప్టెంబర్ 17, 1948న భారత యూనియన్‌లో విలీనం చేసుకునే వరకు కొనసాగింది - అంటూ ఉపన్యాసం ముగించారు. చెప్తున్నంత సేపు విద్యార్థులంతా ఆశ్చర్యంతో బిత్తరపోయారు. మన తెలంగాణా ప్రజలు ఇన్ని కష్టాలు ఎదుర్కోవలసి వచ్చిందా అని. వారి కష్టానికి ఫలితం మేము ఇప్పుడు ఏ కష్టం లేకుండా సుఖశాంతులతో





బ్రతుకుతున్నామని విద్యార్థులు చెప్పారు. చివరగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు, పిరమిడ్స్ బాగా చేశారని విచ్చేసిన అతిథులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

ప్రతి పూర్ణిమనాడు సాయిధామంలో శ్రీ సాయినాథ వ్రతం జరుపబడు తున్నది. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా 05.02.2023నాడు మాఘ పూర్ణిమ. ద్వారవతి సాయి దేవాలయంలో పరిసర గ్రామ భక్తులు విచ్చేసి ఆశ్రమం వారు నిర్వహించే సాయినాథ వ్రత కార్యక్రమంలో పాల్గొని ధన్యులయ్యారు.

మిర్యాలగూడ వెంకటాద్రి పాలెం షిరిడీ సాయి మందిరం 20వ వార్షి కోత్సవానికి ముఖ్య అతిథిగా పూజ్య స్వామీజీ శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామానంద ప్రభుజీ వారు దేవాలయ ధర్మకర్తలు మణి మాధవరావుగారి ఆహ్వానం మేరకు 19వ తేదీ ఉదయం బయలుదేరి కార్యక్రమ సమయానికి సాయినాథుల వారి వార్షికోత్సవంలో పాల్గొని భక్తులకు వారి దివ్య ప్రవచనం అందజేశారు. సత్సంగం యొక్క గొప్పతనం దేవాలయం యొక్క విశిష్టతను, భక్తులు అలవరచుకోవలసిన లక్షణాలను సవివరంగా వివ రించారు. తదనంతరం శ్రీ స్వామి వారు అన్నదాన కార్యక్రమం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎం.ఎల్.ఎ. అయిన శ్రీ భాస్కరరావుగారు, మాజీ ఎం.ఎల్.ఎ. జూలకంటి రంగారెడ్డిగారు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులైన శ్రీమతి మణిగారు మాట్లాడుతూ పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సత్యపదానంద ప్రభుజీ వారే స్వయంగా వచ్చి మాట్లాడినట్లే శ్రీ రామానంద ప్రభుజీ వారు మాట్లాడుతున్నట్లు అనిపించిందనీ, ఎప్పుడూ ఈ వైపు పర్యటనకు వచ్చినా తప్పకుండా ఈ దేవాలయమునకు రావాలని సభాముఖంగా ఆహ్వానం పలికారు. స్వామీజీ వచ్చిన భక్తులకు విభూతి ప్రసాదాన్ని అందించారు.